# “బడీమా”

శ్రీ కె. లింగరాజు గారు

ఆ నీలిరంగు కవరులో ఉత్తరం అందుకునేటప్పటికే నాకు కొన్ని నెలల నుంచి ఎడబాటు జీవితానికి మిథ్యాపథం అంటుకట్టుకున్నట్టే అయింది. పుట్టింటికి వెళ్ళిన లక్ష్మి వ్రాసింది. ఇకనుంచి ప్రతివారంను ఆ నీలిరంగు వుత్తరాలు ఒస్తయి అన్న వుద్దేశ్యంతోటి, ఆశతోటి, రోజూ తపాల బంట్రోతు కోసం వెళ్ళవచ్చుననే ఆనందంతోటి గడప వచ్చునన్న అనునయం పెంపొందుతోంది.

వెళ్ళేటప్పుడు చెప్పింది, “ప్రతీ వారం మీ ఉత్తరం వస్తేనే నాకు సంతోషంగా వుంటుంది. దేవుడు దయ తలిస్తే......” ఇక చెప్ప లేకనే కన్నీళ్ళతో ఉన్న మొఖాన్ని నా ఛాతీమీద అన్చుకుంది. ఆ చెప్పలేని మాటల్లోని ఆవేదన, ఆరాటన, ప్రేమ అన్నీ అవగాహన చేసుకున్నట్లే నాకు హృదయం గుబగుబలాడి పోయింది. కన్నీళ్ళు కారిపోయేయి......

ఆ తర్వాత నెలలో ఉత్తరాలు వ్రాయనే వ్రాసింది... కాని ఆ మధ్య ఉత్తరాల్లో మామగారి ఉత్తరం...“నీకు కుమారుడు పుట్టేడు” అన్నది నన్ను ఆషాఢమేఘంలాగే పింఛంవిప్పుకునేట్టు చేసింది...

ఇంకా ఏన్నో ఆ ఉత్తరం అందుకునేటప్పుడు తట్టేయి. ఎమిటో ఆ మాతృస్థానానికి నేను నా జీవితంలో ఇవ్వలేని కృతజ్ఞత అంతా స్పర్శలోనే కనపడ్డాయి. రక్తం మొఖమ్మీద అంతా చిమ్ముకుంది...

విప్పే! నలుగురు మధ్యా ఆఫీసులో వున్నా అది తీసి చదివే వరకూ హృదయం ఉండపట్టలేదు. “బోసినోటి వరహాల నవ్వుతూ, చిన్న మీ కళ్ళతో, నాఛాయతో మిమ్మల్ని ఎప్పుడు ఆహ్వానిద్దామా అని ఎదురు చూస్తున్న మీ పాపాయికి ఏలినవారి దర్శనం ఎప్పుడు ఇప్పిస్తారో...” తన ఛాయను పొగుడుకోవడంలో లక్ష్మికి ఉన్నంత అతిశయం ఎవరికి లేనేలేదు. ప్రతిరోజూ ఆక్షేపిస్తూనే వుంటుంది, నా ఎండల్కి ఆహుతైన నల్ల శరీరాన్ని.

“మొన్నను ఆవిడ వచ్చింది. పాపాయిని చూచింది. కాగితాలు తయారు చేస్తానన్నది...తూకం వేసి ఇయ్యవలసినవన్నీ బోధించింది...” ఆ మాటలు అర్థం కాలేదు. పుట్టే పుట్టడంతోటే రాజా తన నిత్య సేవలకు ‘ఆయా’ని తెచ్చుకున్నాడా? లేక ఏ పూర్వజన్మంలోనో ఉన్న పుణ్యం వల్ల దేవదూత లెవరైన మారు రూపుతో అవతరించేరా?

అర్థం కాలేదు. ఆవిడ!! ఎవరు? ఎక్కడనుంచి వచ్చింది? ఎవరు పంపేరు? ఎందుకు వచ్చింది? ఎవరు రమ్మన్నారు? ఈలాంటి ప్రశ్నలు ఎన్నో తట్టేయి. లక్ష్మిని చూసి ఏ పిల్లలులేని తల్లయినా నీకు ఏడుగడగావుంటానని మాట ఇచ్చి ప్రతీక్షణం తను ఆదుకుంటోందా?

ఎన్నో విధాలు ఆలోచించా! ఆవిడ వచ్చింది! ఇంట్లో అత్తగారు, మరదలు కాదన్నమాట. మరెవరు?

“తూకం వేసింది...కాగితాలు తయారు చేస్తానన్నది.” నాకు తెలుసున్నమట్టుకు మా అత్తగారి మేనమామ ఆడపడుచు తోడికోడలు కూతురు ఒకత్తె మాత్రం డాక్టరీ చదువుతోంది. ఆవిడ తను చదువుకున్న రెండు సంవత్సరాల మిడి మిడి జ్ఞానం ప్రదర్శనం చేస్తోందా? ఎక్కడో కటక్ లో చదువుతున్నామె, ఇప్పుడు శెలవులూ కావాయె. ఎల్లా వచ్చింది...ఎందుకు వస్తుంది? మామగారేమైనా వ్రాసి రమ్మన్నారా?...అతుకుల బొంతలా కన్పించింది...

ఆవిడ? ఎవరు?...క్షణికం ముందర జీవితంలో వచ్చిన ఆయా నాకు తెలియకుండా వచ్చిందా? పాపాయిలు అంటే నోచుకోలేని మాతృస్థానం ఇల్లా సేవ చెయ్యడానికి తయారై కృతకృత్యురాలవడానికి సన్నద్ధం అయ్యిందా? ఓ వేళవచ్చినా తూకం వెయ్యడం కాగితాలు వ్రాయడం...?

ఎన్ని విధాలు సమన్వయం చేసుకుందా మనుకున్నా కుదరటం లేదు... లోపల ఓ ప్రక్క నా జీవితానికి ఆసరాగా, వంశం నిల్పడానికి పుట్టేడన్న సంతోషం శరీరం

అంతా వ్రాసుకున్నా...ఆవిడిని గురించి సమాధానంకోసం ప్రశ్నలు రాకుండా ఉండలేక పోయేయి.

ఉత్తరం సగంలోనే ఎన్నో విధాలు తట్టేయి...కుదరని సమయాలుకు ఎక్కడ జతపరచడం...ఎంతో ఆనందతోటి. ఉత్తరం వ్రాస్తే ఆవిడని గురించి వ్రాయమన్నా...

అడుగుతున్నప్పుడు లక్ష్మి పూర్ణంగా ఆవిడని గురించి వ్రాయనందుకు కోపం వచ్చింది......

*　　　*　　　*

ఆ రెండు రోజులులోనూ 'ఆవిడ' ఎవరో అని ఆలోచనలు వెళ్ళుతూనే ఉన్నై. రెండు రోజులూ పోస్టాఫీసుకు వెళ్ళే...కాని ఉత్తరం రాలేదు. కోపం వచ్చింది...తన పాపాయిని చూచుకుని, పోలికల్ని లెక్కపెట్టుకుంటూ ఉండే లక్ష్మి నా సంగతి మర్చి పోయినందుకు తిట్టుకున్నా. ఎప్పుడూ ఇంతే ఈ స్త్రీలు! ఎదురుగా వుండినంత సేపే, ఇక దూరమైపోతే...

మూడో రోజు మామూలుగానే గడిచింది... ఆ సాయింత్రం పోస్టాఫీసుకు వెళ్ళకూడదే అనుకున్నా... దారిలోనే...అతడు పిల్చి నీలి కవరు ఇచ్చేడు...

పిల్లా తల్లి క్షేమం కంటె "ఆవిడ" ఎవరూ అన్న ప్రశ్నకే ఎక్కడైనా సమాధానం వ్రాస్తుందేమో అన్న ఆతృతే ఎక్కువగా ఉబకడంతోటి విప్పే...చదినే...

"ఆవిడ...ఆవిడే! మిమ్మల్ని ఓసారి చూచిందట... తర్వాత తరచుగా మీ కథల్ని చదువుతూనే వుందట. మీ కథలు ఈ మధ్య అంత బావోలేదట కూడాను..." మంచిగా, బావుగా వ్రాస్తున్నానని నన్ను పొగడితే అసలు వ్రాయడం మానేస్తానని లక్ష్మికి భయం...అంచేత ఎవరు ఏమన్నా అల్లాగే అన్నారని అబద్ధం వ్రాయడం సర్దా...

"ఓ సారి మీరు ఆమె కలసి గుంటూరు నుండి బెజవాడ వరకు ప్రయాణం చేసేరట..."

గుంటూరు నుండి బెజవాడ లక్షసార్లు ప్రయాణం చేసే...ముక్క తిరుగుడు వ్యవహారంగా వ్రాయడం చిరాకు ఓప్రక్క నుంచి కల్గిస్తూనే యుంది.

"ఏ ఆదివారమైనా రాకూడదూ...ఆవిడా మిమ్మల్ని చూడాలని... మీతో మాట్లాడాలని......?

నాతో మాట్లాడాలి? ఏమిటి మాట్లాడుతుంది...కొంప తీసి ఏ పెద్దత్తేనా కాదుకదా ?...

లక్ష్మి మీద ఇల్లా వ్రాసినందుకు కోపం, చిరాకు, అసహ్యం,...అన్నిటి కంటె ఆర్నెల్ల స్నేహం చేస్తే...ఈ భావం కూడా తోచింది నాలో.

ఆవిడ ఎవరూ ?...ఎంత జ్ఞాపకానికి తెచ్చుకుందా మనుకున్నా జ్ఞాపకం రావటంలేదు ?...ఆవిడ ఎవరు ?...ఎవర్ని అడగను ?

*　　　*　　　*

ఏ ఆదివారానికి ఆవారం వెళదామని అనుకోవడం ఈ బ్యాంకుల్లో పని తెమలక పోవడంతోటి ఆదివారాలు సోమ వారాలవడంతో సరిపోయింది. వారాలు నెలలు గడిచి పోయేయి. ఆ ఇరవై ఆదివారాల్లోనూ వారానికి ఓసారైనా లక్ష్మి ఉత్తరం ఒస్తూనేవుంది. "ఆవిడ రోజూ, లేకపోతే రెండు రోజులకు ఓసారి వస్తూనేవుంది...పాపాయికి మొన్న నీళ్ళు పొయ్యడంలో కొత్త విధానాన్ని చూపించింది...నాన్నారి చేత టర్కిష్‌టవల్స్, పౌడరు కొనిపించింది ... బట్టలు ఎల్లా వుండాలో... ఎప్పుడెప్పుడు పాలివ్వాలో, ఎంతెంత పాలు పట్టాలో...ఇవన్నీ చేస్తునే వుంది...చెప్పుతూనేవుంది..."

"మొన్న తనంతట తాను పాపాయి నోటి నవ్వును చూసి మురిసి పోయింది...తను చూచిన పిల్లలందరిలోనూ చాలా చలాకీ అయిన వాడని...మంచి ఆరోగ్యంగా..."

"మొన్న 'బేబీ వీక్'లో మన అబ్బాయికి ప్రథమ బహుమానంఇచ్చేరు...నిజంగా...ఆవిడే కారణం సుమండీ!"

"నిన్న పాపాయికి జ్వరం వచ్చింది...నేనే ఏడుస్తున్నాడని ఇంకోసారి పాలు ఎక్కువ పట్టేటప్పటికి కడుపు నొప్పి వచ్చి కాబోలు...అప్పుడు నన్ను ఎన్ని చివాట్లు పెట్టిందో..."

"ఇల్లా ప్రతీ విషయంలోనూ తానే ఏకుగడగా ప్రవర్తించే ఆవిడను చూస్తుంటే నేనా, ఆవిడా నిజంగా

మాతృస్థానానికి తగడం? అన్న క్షణిక ఈర్ష్య కూడా ఒస్తోంది..."

"మొన్న చెప్పింది...అనేక బొమ్మలు చూపించింది... ప్రతి నెలనెలకి పిల్లాణ్ణి ఎల్లావుంచాలో, చెప్పింది..."

ఇల్లా ఒస్తునే వుంది. ఒక్కొక్క ఉత్తరంలో ఒక్కొక్క అంశంతోటి...ఉత్తరాలు అన్నీ చూస్తుంటే ఆవిడ ఏరికైరైన మంత్రసానో అని నమ్మకం కుదిరి పోయింది...కాని లోపల్లోపల ఈ పిలవని పేరంటపు వైద్యానికి ఏమిచ్చుకోవాలో అని బెంగగానేవుంది.

ఆ ఉత్తరంలో వ్రాసేనూ ఎన్ని నెలల జీతం సమర్పించుకోవాలి 'ఆవిడ'కు అని...భలే ఆవిడ...

* * *

అన్ని రోజుల ఉత్తరాల్లోనూ ఆవిడ స్వయంగా ఒచ్చి పిల్లాడికి చేసిన ఉపచారాలు వ్రాయడమే కాని...తను ఎప్పుడొస్తుందో వ్రాయడం లేదు. నాకు ఇంక ఎన్నాళ్ళకు ఈ హోటల్ భోజనం గతో..అనుకుని లోపల మంటగానే వుంది...

అనుకోకుండగానే లక్ష్మి చంటి పిల్లాడితో దిగింది. ఆశ్చర్యమే కల్గించింది...ఆ గుమ్మంలోంచి లోపలికి వచ్చి రావడంతోటే పాపాయిని చూచే! నా అంతటు నాకు లక్ష్మి ఇల్లాంటి, ఇంత చక్కటి, ఆరోగ్యవంతుణ్ణి, నాకు ఇచ్చినందుకు నేను ఏ విధంగా కృతజ్ఞత తెల్పుకోవాలో తెలియకుండానే అల్లాగే ఉండిపోయే! ఆ ఆనందంలో కళ్ళు కొంచెం తడి అయ్యేయి.

"ఆవిడ పెంచింది...నేను మాత్రం కన్నాను... ఆవిడ లేకపోతే!..." లక్ష్మి దగ్గరగా ఒచ్చి పాపని చేతుల్లో పెడుతూనే అంది.

"నాన్నారు పాతికరూపాయిలు ఇవ్వబోయేరు కాని ఆవిడ పుచ్చుకోనే లేదు..."

ఆవిడ!! నాకు ఆశ్చర్యంగానే వుంది! ఏం పని? ధనవంతురాలా? ఈ పిల్లల సంరక్షణవల్ల, భావిభారత భాగ్యోదయంలో సువర్ణ కలికలుగా తయారు చెయ్యడానికి తన జీవనం త్యాగం చేస్తోందా? భావి ప్రపంచం అంతా ఇప్పటి ఈ సంతానపు పెంపు, శిక్షణల మీద ఆధారపడి వుందనినమ్మి, తన ఆశయమును ఇల్లా ప్రచారంచేస్తోందా?... ధన్యజీవి అనుకున్నా...జీజీబాయ్...అల్లాంటి మాతలంతా జ్ఞాపకం ఒచ్చేరు...

"ఆ రోజే తను ఇక వచ్చే నెలల్లో, సంవత్సరాల్లో పాపని ఎల్లా పైకి తీసుకురావాలో చెప్పింది. మర్చిపోతానేమో అని వ్రాసి ఇచ్చింది కూడా"...

అన్నీ చూచే...ఏ వయస్సులో ఏ ఆహారం ఇవ్వాలి... పళ్ళు ఒచ్చేటప్పుడు ఎల్లా పిల్లల్ని జాగ్రత్త పరచాలి, తర్వాత మాటలు వచ్చినపుడు ఏం చెప్పాలి...ఇంకా పెద్ద అయిం తర్వాత ఎల్లాంటి కథలు చెప్పాలి......ఎన్నో...

ఆ క్షణంలో ఆవిడే నా ఎదురుగా వుంటే చేయెత్తి పూర్ణ నమస్కారం చేసే వుండేవాణ్ణి... ఆవిడ! ఎక్కడ సంపాదించింది ఈ ప్రజాసేవ? భావిభారత భాగ్యోదయానికి పునాదులు వేసే మాత...ఎక్కడ వుంది?...అన్న ఆనందమూ కల్గింది...ఏం ఇస్తే ఋణం తీరుతుంది?

ఆవిడణ్ణి చూడాలి. మాట్లాడాలి అన్న కోర్కె నాకు హెచ్చైపోతునేవుంది...

* * *

పాపకి ఐదేళ్ళు వచ్చేయి. ఆ వయస్సులోనే ఎంతో చలాకీగా ఎన్నో వీర కథలు చెపుతాడు. వింటాడు... నాకు వాణ్ణి చూస్తుంటే భావిలో వీడు ఏ నియంతైనా అయిపూరుకుంటడేమో అన్న ఆశకల్గుతూనే వుంటుంది...

ఆ పుట్టిం రోజుకు నేను స్వయంగా ఆవిడని రమ్మని ఉత్తరం వ్రాసే...కబురుకూడా పంపే ... ఒస్తుందన్న నమ్మకం నాకు ఇదివరకటి పుట్టిన రోజుల ఆహ్వాన సమాధానాల వల్ల లేదు...

ఆ సాయంత్రం ఎవరో ఒస్తునే వున్నారు...వెళుతూనే వున్నారు...లక్ష్మి అధాత్తుగా వస్తూనే! ఏమండోయ్! ఆవిడ వచ్చింది...రాండి..."

ఆవిడ! ఆవిడ!! లోపల్కి వెళ్ళే...సన్నగా, పొడుగ్గా

ఇరవై అయిదువత్సరాలలోపుగా, చామనచాయలో ఉన్న ఆమె, ఆవిడా? ఈ సన్నగా పూచలావున్న స్త్రీలో, ఇటువంటి మహోన్నత భావాలు నిబడీ కృతం అయివుండి, ఇప్పుడు ప్రజల్లోకి, ప్రతీ మాతృ హృదయంలోకి చొచ్చు కుంటున్నాయా? ప్రతీ పెరిగే బిడ్డా ఇప్పుడున్న ఈ మురికి మురణ వాతావరణాల్లోంచి వీర చరిత్రలకు పునాదిరాళ్ళు వేసుకుంటున్నారా...?

అల్లాగుడ్లు అప్పగించి నమస్కరించే!! నవ్వుతూనే ఆవిడా నమస్కరించింది..." మీ వాడు చాలా అల్లరివాడు సుమండీ... దేవాంత కుడిలావున్నాడు..." చేతుల్లోకి తీసు కుంటునే అంది...

"మీ చలవే కాదా?" ఆ ముక్కలు నాకు నిజంగా హృదయాంతరాళాల్లోంచి విశ్వవిపంచి గానం చేస్తుంటే మ్రోగినట్టే ఒచ్చేయి. ఏ విధంగా కృతజ్ఞత చూపుకోవాలో నాకు తెలియటం లేదు.

మర్నాడు పళ్ళెంలో ఏవో పెట్టి లక్ష్మి ఆవిడకి కృతజ్ఞతగా ఇవ్వబోయింది. ఆవిడా నవ్వుతూనే నేనే మీ అబ్బాయికి ఆనందంగా ఇస్తున్నా. రేపు మీ వాడు పెరిగి పెద్ద వాడై కీర్తి గౌరవాలు తెస్తే అదే నాకు ఆనందం. అంత కంటె నాకు ఇంకేం కావాలి..."

ఆ హృదయంలో ఇంత విశాలత్వం, అమరత్వం ఎక్కడ దాక్కుని ఉన్నాయా అనిపించింది...బండి ఎక్కుతూనే తన విజిటింగ్ కార్డు ఇచ్చింది... "మిస్......లేడీ హెల్తు విజిటర్..."

ఉద్యోగా!! పిల్లల్ని సంరక్షించడానికి ప్రభుత్వం నియమించిన "బడీమా"?

వాకబు చేసే...అరవైరూపాయిల జీతం...రెండు జిల్లాల క్యాంపు. పదిరూపాయిల భత్యం...లంచాలు పుచ్చుకోకూడదూ...వెనక్కు తిరిగి అనుకున్నా...ఆవిడ కడుపుకేం మిగల్తుంది అని...ప్రతీ మాతృ హృదయం ఋణంగా ఆవిడికి ఆజన్మాతరంపడి వుండేమో! మరి ప్రభుత్వం! అధికారులు?

★

# మందుల మనిషి

శ్రీమతి తాతాని సుబ్బులుగారు

మోటుచీరతల్లో, సుబ్బమ్మగోరు
ముద్దెయ్యితల్లో, రాజమ్మగోరు
గుడ్డెయ్యితల్లో, రుక్కమ్మగోరు
కరువోచ్చితల్లో, కాలుతుండంతల్లో
విశాఖలోతల్లో విలపిత్తుంద్రుతల్లో
కడపలోతల్లో, కష్టపడుతుంద్రతల్లో
అనంతపురంలోతల్లో, అలమటిస్తుంద్రుతల్లో
కంట్రోలుతల్లో, కలకాలముండదుతల్లో
తిండికరువుతల్లో, గుడ్డకరువుతల్లో
పెకాశంగోరుతల్లో, పెథానైయెతల్లో
గుడ్డకరువుతల్లో, పోతాదితల్లో
ఊరూరతల్లో, రాటాలుతల్లో
పెట్టించితల్లో, సేత్తుంద్రుసేవతల్లో
గాంధిగోరుతల్లో, చల్లగుండలితల్లో
కాంగ్రెసోరుతల్లో, కష్టాలుతీర్చుతరుతల్లో
అల్లరిచేయకండితల్లో, మళ్లోస్తంతల్లో
ఏటికొక మారుతల్లో, మేము స్తంతల్లో
గాంధిగోరుపుట్టుకతల్లో, కలియుగానతల్లో
పండుగతల్లో, పరమానందంతల్లో॥

★